"అలా గనడం తప్పు కదూ !" అన్నాడు బావ.

"తప్పెందు కయింది? వాడు నా మనసుకు నచ్చని పని ఏదో చేశాడు. అందుకే నా క్కోపం వచ్చింది. మన దగ్గర జీతం తీసుకుని మనమీద ఆధారపడి బ్రతికే వాడిని మనం మాటలంటే తప్పేముంది?" అన్నాను.

"వాడి స్థానంలో ని న్నూహించుకో. వాడు ని న్నలా తిడితే నీ కెలాగుంటుందో చెప్పు" అన్నాడు బావ.

"ఛీ - వాడి స్థానంలో నన్ను నే నెందు కూహించుకోవాలి? ఆలోచనలో కూడా నే నది భరించలేదు" అన్నాను.

"మనిషి తన్ను తాను అర్థం చేసుకుని సంస్కరించుకోవాలంటే తరచుగా చుట్టూ ఉన్న వారిలో పరకాయ ప్రవేశం చేస్తూండాలి."

నేను ఉక్రోషంగా - "అకారణంగా తిట్టా ననిపించినప్పుడు నేను పనివాళ్ళకు తరువాత పిలిచి డబ్బు లిస్తూంటాను. వాళ్ళు సంతోషంగా వెళ్ళిపోతారు. జరిగినది మర్చిపోతారు" అన్నాను.

బావ నిట్టూర్చి - "లత ! నువ్వు నీ పని వాళ్ళను మెచ్చుకుని కానుక లిచ్చా వనుకో. అవి ముత్యాలై, రత్నాలై, వజ్రాలై ఆభరణాలుగా వారి వంటిమీద ప్రకాశిస్తాయి. నీవు వాళ్ళను మాటలతో, చేతలతో హింసించినప్పుడల్లా వారి వంటిమీద కనిపించని గాయా లవుతాయి. ఆ తరువాత నీ విచ్చే కానుకలు ఆ గాయాలకు లేపనాలు. ఒకసారి గాయం అయేక అది మానినా వంటిమీద మచ్చ మిగిలిపోతుంది. నీవు నీ పని వాళ్ళ శరీరాలను మచ్చలతో నింపుతావో, ఆభరణాలతో ప్రకాశింపజేస్తావో అది నీ ఇష్టం" అన్నాడు.

నేను మారలేను. బావను నాకులా మారమంటున్నాను.

"నీ పద్ధతి సరైనదని తోచిన రోజున నేను నీకులా మారడానికి ప్రయత్నిస్తాను" అన్నాడు బావ.

అప్పుడు నా వయసు పద్నాలుగు.

ఇప్పుడు నా వయసు పందొమ్మిది.

నేను కాలేజీలో చదువుతున్నాను. కాలేజీ చదువు నా అహంకారాన్ని మరింతగా పెంచింది. నా చుట్టూ ఎందరో ఆరాధకులు. వారిలో విద్యార్థులూ ఉన్నారు. అధ్యాపకులూ ఉన్నారు.

నేను మాత్రం ఎవరినీ లక్ష్యపెట్టడంలేదు. నాకు తెలుసు - నేను బావను పెళ్ళి చేసుకుంటానని ! అందుకే ఏ మగాడినీ కూడా నేను ఆటవస్తువుగానే తప్ప ప్రత్యేకంగా చూడలేదు. నా వద్దకు ప్రేమ కబుర్లు చెప్పడానికి వచ్చే వారందరితోనూ కాసేపాడుకుని, ఆ విశేషాలు కాలేజీలో నా స్నేహితురాండ్రకూ, ఇంట్లో బావకూ చెప్పి వినోదించేదాన్ని.

ఇప్పుడు బావ యూనివర్సిటీలో రీసెర్చి చేస్తున్నాడు. అతడిలో గతంలో ఉన్న చిలిపితనం తగ్గి గాంభీర్యం పెరిగింది. నాతో తరచుగా- "లతా! ను వ్విప్పుడు చిన్నపిల్లవు కాదు. నీ పద్ధతులు మార్చుకోవాలి" అంటున్నాడు.

కొన్నాళ్ళపాటు నే నిది పట్టించుకోలేదు. ఒక రోజున అతనితో వాదనకు దిగాను. ఆ వాదన నా జీవితాన్నే ఓ మలుపు తిప్పుతుందని అప్పట్లో నాకు తెలియదు.

"నే నెందుకు మారాలి? మారను..." అన్నాను బావతో.

"నీవు వినోదానికై చుట్టూ మగవాళ్ళను చేరదీస్తున్నావు. వాళ్ళను రెచ్చగొడుతున్నావు. ఏదో ఒక రోజున అపవాదులపా లవుతావు..."

"నా చుట్టూ చేరిన వాళ్ళు నా పాదాలను మించి పైకి చూడలేరు. మంచి మాటలే తప్ప అపవాదులు నాపై ప్రయోగించలేరు..." అన్నాను.

"అది నీ భ్రమ."

"భ్రమ నాదే ఎందుకు కావాలి? నువ్వు భ్రమపడుతున్నావెందు కొప్పుకోవు?"

"నీ కంటే పెద్దవాణ్ణి. అనుభవంలో అయిదేళ్ళు లోకానుభవంలో ఎన్నో ఏళ్ళు నీ కంటే గొప్పవాణ్ణి..."

నేను నవ్వి- "వయసు అనుభవాన్ని తేదు. అందుకు నువ్వే సాక్ష్యం" అన్నాను.

"తెలివి తక్కువగా మాట్లాడకు. నువ్వు మారాలి..."

"ఎందుకు?"

"మనం జీవితాంతం కలిసి బ్రతకాల్సిన వాళ్ళం..."

"అలాగని ను వ్వనుకుంటే సరిపోదు. అందుకు ను వ్వేమైనా చేయాలి..." అన్నాను.

"అంటే?"

"నేను నీకు మరదల్ని కదా అని నాపై సర్వాధికారాలూ ఉన్నట్లు మాట్లాడకు. పెద్దల మాటకు తల వంచి నేను నీ ముందు మెడవంచి తాళి కట్టించుకుంటా ననుకోకు. ముందు మాటి మాటికీ లెక్చర్లివ్వడం మాను. ఆ తరువాత నా మనసును గెల్చుకునేందుకు - అందరి మగాళ్ళతో పాటూ పోటీపడు. ఆ పోటీలో నెగ్గినప్పుడే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అన్నాను.

బావ నా మాటలకు నివ్వెరపోయాడు. తరువాత ఒక క్షణమాగి- "మరి నువ్వు నన్ను మెప్పించేందుకు ఏం చేస్తావు?" అనడిగాడు.


"ఒకరి కోసం నే నేమీ చేయను. నా కోసమే ఎవరైనా ఏమైనా చేయాలి. అందాల రాకుమారిని నేను. నాతో మాట్లాడాలంటేనే నన్ను మెప్పించాలి. తెలిసిందా?" అన్నాను.

అంతేకాదు. ఆ రోజు నుంచీ బావను తప్పించుకుని తిరగడం మొదలుపెట్టాను.

కొన్నాళ్ళ పాటు బావ తనూ నా చెంతకు రాలేదు. కానీ తరువాత మళ్ళీ నా చుట్టూ తిరగడం మొదలుపెట్టాడు.

"బుద్ధి వచ్చిందా?" అన్నాను ఒక రోజున.

"లత ! మొండి పట్టు పట్టకు. మనుషుల్ని మనుషుల్లా చూడడం నేర్చుకో. అప్పుడే జీవితంలో సుఖపడతావు" అన్నాడు బావ.



# దేవతా, అహంకరించు!

జొన్నలగడ్డ రామలక్ష్మి

"నేను సుఖపడడానికే పుట్టాను. నువ్వు సుఖపడాలంటే నీకు నేను కావాలి" అన్నాను గర్వంగా.

"మనిషి సుఖాని క్కావలసింది అందం, డబ్బు కాదు. అవగాహనతో కూడిన తోడు" అన్నాడు బావ.

అందుకు బావ ఉదాహరణగా సావిత్రి పేరు చెప్పాడు.

సావిత్రి నా క్లాసుమేటు. మనిషిలో ఏ విధమైన ప్రత్యేకత లేదు. వయసు కారణంగా కాకపోతే ఆమెలో ఆకర్షణే ఉండేది కాదని నా అభిప్రాయం. ఎందుకంటే సావిత్రి నాకు చిన్నప్పటించీ తెలుసు. ఈమధ్యనే సావిత్రి కాస్త చూడ్డానికి బాగుంటోంది. అలాంటి సావిత్రి నీమధ్యనే ఓ దూరపు బంధువు లబ్బాయి ప్రేమిస్తున్నాడు. అత డీ ఊ రొచ్చి ఏడాదే అయింది. బాంకులో ఉద్యోగం. అతడి పేరు మధు.

నాకు ఉదాహరణగా చెప్పాలనే, ఏమో బావ మధుతో పరిచయం చేసుకున్నాడు. అతడి గురించి తెలుసుకున్నాడు.

మధు మధ్య తరగతిలో కాస్త ఉన్నత స్థానంలోనే ఉన్నాడు. అతడి చుట్టూ ఎందరో ఆడపిల్లల తలిదండ్రులు తిరుగుతున్నారు. కట్నాల బజార్లో అతడికి ఏభై వేల నుంచి లక్ష రూపాయల దాకా ధర పలుకుతోంది. తలిదండ్రులు చూస్తున్న సంబంధాల్లో నలుగురు పిల్లలు అప్సరసల్లా ఉంటారు. మధు వాళ్ళ ఫోటోలు కూడా బావకు చూపించాడు. ఇంతకూ జరిగిన దేమిటంటే మధు సావిత్రిని కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవా లనుకుంటున్నాడు.

"సావిత్రికి డబ్బు లేదు. అందం లేదు. రెండూ ఉన్న ఎందరో మధు చుట్టూ తిరుగుతూంటే అతడు సావిత్రినే పెళ్ళి చేసుకుంటా నంటున్నాడంటే అందు క్కారణం సావిత్రి వినయం, మంచితనం, మానవత్వం. ఏ మగవాడైనా జీవితంలో కోరుకునేది అలాంటి తోడునే !" అన్నాడు బావ.

బావ అభిప్రాయం తప్పని ఋజువు చేయడం కోసం నేను సావిత్రితో స్నేహం పెంచుకున్నాను. ఆమెను నా ఇంటి కాహ్వానించడం ప్రారంభించాను. క్రమంగా నాకు మధుతో పరిచయమయింది.

## గుండెసెగలు

మనసు భవంతిలో
స్వార్థపు భూతాన్ని
ఆరవ ప్రాణంగా
పోషించుకొంటున్నాం !
జీవిత వేదిక మీద
సమాజోద్ధరణ మనే
నాటకాన్ని
వీరోచితంగా ప్రదర్శిస్తున్నాం !
'సేవ'లనే ప్రకటనల
పసిడి ముసుగులో
ఆస్తుల - ఆత్మబంధువుల
రక్షణ కంచెలను
దృఢపరుచుకొంటున్నాం

-కీర్తి

నేను కావాలనే మధుని ఎక్కువగా మెచ్చుకునేదాన్ని. అతడికి లేని గొప్పతనా న్నంటగట్టి పొగిడేదాన్ని. అతడి వంక ఆరాధనాపూర్వకంగా చూసినట్లు నటించేదాన్ని. నా ఉపాయం ఫలించింది. మధు నా ఆకర్షణలో పడ్డాడు. సావిత్రితో పాటు తరచుగా మా ఇంటికి వస్తుండేవాడు. నా చిరునవ్వులకోసం, అభినందనల కోసం తపించిపోతూండేవాడు.

మా పరిచయం ఒక స్థాయికి చేరుకున్నాక నేను సావిత్రిని చిన్నబుచ్చడం ప్రారంభించాను. అదీ మధు ఎదుట ! మొదట్లో మధు ఏమీ అనేవాడు కాదు. కానీ క్రమంగా నన్ను సంతోషపెట్టడం కోసం తనూ సావిత్రిని చిన్నబుచ్చసాగాడు.

ఇది సావిత్రి కిబ్బందిగా ఉండేది. కానీ ఆమె ఏమీ అనలేకపోయేది. ఒకోసారి మధు మాటల కామె కళ్ళలో నీళ్ళు కూడా తిరిగేవి.

మధు ఆమెను మాటలతో హింసించి మెప్పుకోసం నా వంక చూసేవాడు. నాకోసం అత డేమైనా చేయడానికి సిద్ధంగా ఉండేవాడు.

ఒక రోజున అతడు సావిత్రి కట్టిన చీరను పరిహాసం చేస్తూ- "ఎలాంటి చీర కట్టినా అందంగా ఉండే విద్యుల్లత తన చీరల ఎన్నికలో అద్భుతమైన అభిరుచిని ప్రదర్శిస్తుంది. అసలే నీ అందం అంతంత మాత్రం ! ఈ చీర నీ కెలా నచ్చిందో నాకు తెలియడంలేదు. బహుశా అభిరుచి అందానికే అంకితమేమో !" అన్నాడు.

ఒక ఆడదానికి మరో ఆడదాని ఎదుట అంతకు మించిన అవమానం వేరే ఏముంటుంది ?

నేను చప్పున - "సావిత్రి అభిరుచిని తప్పుపడుతున్నావు. నీ అభిరుచి మాత్రం ఏం గొప్పది?" అన్నాను.

అతడు దెబ్బతిని- "నా అభిరుచి మీద నీకు దురభిప్రాయం కలిగిందంటే అది తప్పక మార్చుకోవలసిందే ! ఏమిటో చెప్పు..." అన్నాడు.

"సావిత్రిని నీ జీవిత భాగస్వామిగా ఎన్నుకున్నావు" అన్నాను.

మర్నాడు బావ నాకు చెప్పాడు - మధు సావిత్రిని వివాహం చేసుకునే ఆలోచన మానుకున్నాట్ట. కారణం తెలియక బావ కొట్టుమిట్టాడిపోతున్నాడు.

"ను వ్వన్నావుగా... మగాడు ఆడదానిలో వెతికేది అందం, డబ్బు కాదని ! అందుకని నేను మధు మీద ఓ ప్రయోగం చేశాను" అంటూ జరిగింది చెప్పాను.

బావ తెల్లబోయి-"వెయ్యి అబద్ధాలాడైనా ఓ పెళ్ళి జరిపించా లంటారు. ను వ్వో పెళ్ళి చెడగొట్టావు" అన్నాడు.

"అందులో తప్పేముంది?" అన్నాను.

"నీకు సావిత్రి ఉసురు తగుల్తుంది" అన్నాడు బావ.

"అదీ అబద్ధమని ఋజువు చేస్తాను. నువ్వు కలగజేసుకోకుండా ఉంటే !" అన్నాను.

"అసలు నే నిక నీ వ్యవహారాల్లో కలగజేసుకోను..." అని చిరాగ్గా వెళ్ళిపోయాడు బావ.

నేను సావిత్రి ఇంటికి వెళ్ళి జరిగిందానికి బాధపడుతున్నట్లుగా- "ఇలా జరగాలని నేను కోరుకోలేదు..." అన్నాను.


"ఇందులో నీ తప్పేమీ లేదు. మధు అసలు రంగు బయటపెట్టడంలో నువ్వు నాకు సాయపడ్డావు. ఇప్పుడు జరిగిన విశేషం పెళ్ళయ్యాక జరిగితే - అది నాకు దిద్దుకోలేని తప్పయ్యేది" అంది సావిత్రి శాంతంగా.

నే నాశ్చర్యపడినా బయటకు తెలియనివ్వలేదు. సావిత్రి నింకా ఏడిపించాలని నా ఆశయం. అందుకే- "నువ్వు ఎప్పటిలాగే రోజూ మా ఇంటికి వస్తేనే - నీ మాటలు నేను నమ్ముతాను" అన్నాను.

"నా దురదృష్టం. అమ్మ ఆరోగ్యం బాగుండడంలేదు. డాక్టరు దగ్గరికి వెళ్ళాలంటే తన జబ్బుకి పెద్ద పేరు పెట్టి దోచేస్తాడని అమ్మ భయం. కాలేజీ కెలాగూ తప్పదు కానీ ఇంటి దగ్గర అమ్మ నొక్కర్తినీ ఎక్కువసేపు వదలలేను..." అంది సావిత్రి.

నాలుగేళ్ళ క్రితం సావిత్రి తండ్రి పోయాడు. ఆయన పోయినప్పుడు వచ్చిన ఇన్సూరెన్సు డబ్బులు బాంకులో వేసుకుని దానిమీద వచ్చే వడ్డీ డబ్బులతో గుట్టుగా రోజులు గడిపేస్తున్నారు సావిత్రి, తల్లి. ఇలాంటి సమయంలో జబ్బులకు ట్రీట్‌మెంటంటే మాటలు కాదు.

ఈ అవకాశాన్ని నే నుపయోగించుకున్నాను. సావిత్రి తల్లిని వెంటనే ఓ నర్సింగ్‌హోమ్‌లో



చేర్పించాను. డాక్టరు మా నాన్నగారి స్నేహితుడు.నర్సింగ్ హెూం ఖర్చులన్నీ నావి. నాలో ఇంత మానవత్వమున్నందుకు మా ఇంట్లో కూడా ఎంతో సంతోషించారు.

నర్సింగ్‌హెూంలో సావిత్రి తల్లికి సకల మర్యాదలూ జరుగుతుంటే మా ఇంట్లో నేను సావిత్రిని నానామాటలూ అని చిన్నబుచ్చే దాన్ని ఒకసారి యథాలాపంగా ఒకసారి బావ ముందు, ఒకసారి నా స్నేహితురాండ్రముందు...

సావిత్రి మౌనంగా అన్నీ సహించేది.

ఒక రోజున బావ నన్ను సావిత్రి విషయంలో మందలించాడు.

“కందకు లేని దురద కత్తిపీట కెందుకు?” అన్నాను.

“ఆమె కృతజ్ఞతా భారంతో నీ ఆగడాలు సహిస్తోంది. నీ బారినుండి కాపాడ్డానికి నే నామెకు సాయపడా లనుకుంటున్నాను...” అన్నాడు బావ.

“నువ్వు నా వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దని ముందే చెప్పాను” అన్నాను హెచ్చరికగా.

“లతా ! ఏమిటి నువ్వు సాధించా లనుకుంటున్నది?”

“నువ్వు నన్ను నీకు బానిసగా మార్చాలని వినయం, మానవత్వం, మంచితనం అంటూ పిచ్చి నీతులు బోధించావు. అవన్నీ తప్పని నేను ఋజువు చేస్తున్నాను. మనిషి స్వార్థపరుడు. స్వార్థంకోసం మనిషి ఏమైనా చేయగలడు. నువ్వు చెప్పిన వినయం, మంచితనం, మానవత్వం - మనిషిలో స్వార్థం వల్లనే పుట్టుకొస్తాయి. నా స్థానంలో ఉంటే సావిత్రి నాకు లాగే ఉండేది. కాదంటావా?”

“అయితే ఏమంటావ్?”

“నన్ను బానిసలా మార్చాలని చూడక నాకు బానిసలా పడుండడం నేర్చుకో ...” అన్నాడు తీవ్రంగా.

“నా మరదలివి కాబట్టి ని న్నీ మాటలకు క్షమించాను...” అన్నాడు బావ ఏమాత్రమూ ఆవేశపడకుండా.

“నేను నీ మరదలినైనా - సావిత్రి కిలా ఉండుంటే - నీ క్షమ నాకు లభించి ఉండేది కాదు” అన్నాను సావిత్రి అందాన్ని నిరసిస్తూ.

“సావిత్రి కిలా ఉండుంటే నీకు ఎవరి క్షమా అవసరముండదు” అన్నాడు బావ సావిత్రి గుణాల్ని ప్రశంసిస్తూ.

“అవసరం కోసం సావిత్రి ఏమైనా సహించగలదనీ, ఆత్మాభిమానాన్ని చంపుకోగలదనీ నేను ఋజువు చేశాను. ఆమె పురుషుడికి ఆదర్శపత్ని కాలేదని నువ్వు ఋజువు చేశావు...”

“నే నెప్పుడు ఋజువు చేశాను?” అన్నాడు బావ ఆశ్చర్యంగా.

“ఎంత నిరసించినా నువ్వు నా చుట్టూ తిరుగుతున్నావు...”

“చిన్నప్పట్నుంచీ చనువున్న మరదలివి కాబట్టి...”

“కాదు... సావిత్రి నా వంటి వారికి చూపడానికి పనికివచ్చే ఉదాహరణ మాత్రమే ! కాదని నువ్వు ఋజువు చేయగలవా?”

బావ నా వంక అదోలా చూసి- “నీ సవాలుకు అర్థం తెలుసా?” అన్నాడు.

“తెలుసు. అదృష్టం, దురదృష్టం నీ ముందు నిలబడి ఉన్నాయి. నీ ఎన్నికలో నీ అభిరుచి బయటపడుతుంది” అన్నాను.

## ఒక అర్ధరాత్రి

చీకటి చెరువులో
చిక్కని వెలుతురు పడవ
తేలుతున్న అర్ధరాత్రి,
నులి వెచ్చని నిద్ర దుప్పటిలో
అంతా మైమరచినపుడు
ఏ అనుభూతికి ఆధార మది ?
ఏ ఉదయాద్రి పై నిలుచున్న
ఉగ్ర రూప మది ?

-నిఖిల్

** ** **

సావిత్రి తల్లికి పూర్తిగా నయమయింది.

“నువ్వు మనిషివి కాదు, దేవతవు...” అంటూ సావిత్రి నాకు పాదాభివందనం చేసింది.

నేను తడబడుతూనే సావిత్రిని లేవదీసి- “నువ్వు నిజంగానే నన్ను దేవతగా భావిస్తున్నావా లేక నటిస్తున్నావా?” అన్నాను.

“నటన నాకు చేతకాదు” అంది సావిత్రి.

“నేను నీకు ఆర్థికంగా సాయపడి ఉండవచ్చు. కానీ మానసికంగా హింసిస్తున్నాను. కాదంటావా?”

“నువ్వు నన్ను హింసించడంలేదు...” అంది సావిత్రి.

“మధు ఎదుట ని న్నెన్నో మాట లన్నాను. చివరికి మీ పెళ్ళి ఆగిపోయింది...”

“ఆ విధంగా మధు అసలు రంగు బయటపెట్టావు...”

“రోజూ నా ఇంటికి పిల్చి మాటలతో నలుగురి ముందూ అవమానిస్తున్నాను...”

“అది నాకు అవమానం కాదు. రోజూ నీ ఇంటికి వచ్చినందుకు నా తల్లి జబ్బు నయమవుతోంది...”

సావిత్రి కళ్ళు నిర్మలంగా ఉన్నాయి. ఆ క్షణంలో ఆమెను చూస్తే నాకు దేవతలా అనిపించింది. తొలిసారిగా నే నేదో తప్పు చేస్తున్నా నన్న అనుభూతి కలిగింది.

“సావిత్రీ ! నా అహంకారాన్ని మన్నించగలవా?” అన్నాను అప్రయత్నంగా.

సావిత్రి చప్పున నా రెండు చేతులూ పట్టుకుని - “ప్లీజ్ ! అలా గనకు. నీ అహంకారమే నాకు వరం...” అని.

“అబద్ధం !”

“నిజం లతా ! కలిగినవారి వినయగుణం పేదవారికి శాపం కావచ్చునని నే ననను. కానీ నీ అహంకారం నాకు ప్రసాదించిన వరాలను చూస్తూంటే - భగవంతుడు మనిషికి ఏ స్వభావాన్నీ అనవసరంగా ఇవ్వ డనిపిస్తోంది. లేకుంటే నీ బావ వరుణ్ నన్ను పెళ్ళి చేసుకుంటాననడు కదా !” అంది సావిత్రి.

సావిత్రి అబద్ధం చెప్పలేదని తెలుసుకుందుకు నా కెంతోసేపు పట్టలేదు.

అప్పుడు నాలోని అహంకారం తొలగిపోయి ఉంటే బహుశా మరోసారి సావిత్రి పెళ్ళి చెడిపోయుండేది. అహంకారం ఎదలో నన్ను బావ వదులుకోలేడని నాకు తెలుసు.

కానీ నేను అహంకారం వదులుకోగలనా?

అహంకారంతో నేను సావిత్రికి మరోసారి వర మిచ్చాను. ఆ వరం నా పట్ల శాపమని గ్రహించే ందుకు నా అహంకార మెలాగూ ఒప్పుకోలేదు.

సావిత్రి నన్ను దేవత అంది.

అహంకరించిన నేను దేవతనైతే - అహంకారంలో ప్రయోజనాన్ని చూసి వరాలను పొందిన ఆమె నేమనాలో నాకు తెలియదు.

*

